

[పుల్లి మొగుడు తలమీద పెద్ద మూట ఎత్తుకుని కాలవమలుపు తిరిగాడు. ఇంతలో పుల్లికూడా కాలవమలుపులో కనబడింది. మొగుడూ, పెళ్లామూ కబుర్లు చెప్పుకుంటూ వస్తున్నారు—]

పుల్లి

రంగనాథం డాము పక్కని కూచున్నాడు.

నీరు లుంగలుచుట్టుకుంటూ డాము ఇవతలకి దూకుతోంది. కాలవ అవతల జనపచేలు పచ్చగా పూసి ఉన్నాయి. పొరుగూరు సంతనించి జనం తిరిగివస్తున్నారు.

రంగనాథాని కేమీ తోచడం లేదు. ఈసారి అతనికి ఆపల్లెటూరు దిగులుగా ఉంది. అందులో పొద్దున్న పుల్లి గొడవ చూసినప్పటినించీ.

పుల్లి అతని తాతగారి ఇంట్లో దాసి—అతని చిన్నతనం నించీ కూడా. ఇంట్లో మనిషికన్నా ఎక్కువగా ఉండేది. అతన్ని చిన్నతనంలో ఎత్తుకుతిరిగేది—అతనికి పాలు ఇచ్చిందట కూడాను; అతని తల్లి చెపుతూ ఉంటుంది. పుల్లి నవ్వితే చాలు ఇంట్లో పిల్లలందరూ ఏడుపులు మానివేసేవారు. ఒక్కసారి పుల్లి ఎత్తుకుని నలిపిపారేస్తే (పుల్లి మెల్లగా ఎత్తుకోదు; ముద్దుగా ఇటూ అటూ ఊపేస్తూ కిచకిచ పెడుతూ ఎత్తుకుంటుంది) పిల్లలు పకపక నవ్వుతారు. ఆమె కలకలలాడుతూ వస్తుంది. ఆమె చురుకుగా చలాకీగా చూస్తుంది. నలభయి ఏళ్లు పైబడ్డా ఆమెలో చురుకు తగ్గలేదు. రంగనాథం మేనమామల ఇంటికి రావడానికి పుల్లి ఒక పెద్ద ఆకర్షణ. ఆమెతో ఎన్నాళ్లయినా అతడు కబుర్లు చెపుతూ గడిపేవాడు. అందుకని మేనమామల ఊరంటే అతనికి ఎంతో సరదా ఇన్నాళ్లూనూ.

పొద్దున్న అతను కళ్లారా చూసిన గొడవంతా అతని మనస్సులో అల్లకల్లోలంగా నిండి ఉంది. అతనికి అన్నిటిమీదా కోపంగా ఉంది. పుల్లిమీదా, పిల్లంకడిమీదా, ఆ ఊరుమీదా, పుల్లి మొగుడు మీదా.

పుల్లి మొగుడు దూరాన్ని కనబడ్డాడు. తలమీద పెద్ద మూట ఎత్తుకుని కాలవమలుపు తిరిగాడు. దారిపక్కని ఉన్న మర్రిచెట్టు కింద ఎవరితోనో ఒకక్షణం మాట్లాడాడు. పక్కని బియ్యపుమర ఆఖరిపొగ గుప్పుగుప్పున వొదిలి ఆవేళకి పని చాలించింది. ఇంతలో పుల్లికూడా కాలవమలుపులో కనబడింది. మొగుడూ, పెళ్లామూ కబుర్లు చెప్పుకుంటూ వస్తున్నారు-ఎల్లా చెప్పుకోగలుగుతున్నారో అతనికి ఆశ్చర్యం వేసింది; ఇంతగొడవయ్యాక.

పిల్లంకడు అతని పక్కని వచ్చి కూర్చున్నాడు. పాలు పితికి అప్పుడే దూడల్ని వొదిలాడు. వెనకఉన్న పశువుల సావడిలో దూడలకాళ్ల చప్పుడు, పొదుగులకోసం వాటి ఆబ, ఆవుల ఆకలి అరుపులు రంగనాథం విన్నాడు. వెనక్కి తిరిగి చూశాడు. ఎర్రటి సంజఎండ మామిడితోటమీద పాకింది. పచ్చిమామిడికాయలు ఆ వెలుగులో స్పష్టంగా, స్ఫుటంగా కనబడుతున్నాయి. పిల్లంకడి గుడిసెలోంచి పొగ లుంగలుగా ఆకాశంలోకి వ్యాపిస్తోంది.

పిల్లంకడి వేపు చూశాడు. పిల్లంకడు నలభయి ఏళ్లు-దాటిన నవ్వు మొగంతో అప్పుడే పెళ్లయిన కుర్రవాడిలా ఉంటాడు. సరదాగా నిర్లక్ష్యంగా చుట్ట కాలుస్తూ చూస్తాడు. అతడు పుల్లీ, పుల్లి మొగుడూ సంతనించి వస్తుండడం చూశాడు.

"రంగన్న బాబో! సంకురేత్తిరికి రాలేదేం? మామయ్యా సాలా సూశాడు నువ్వూ, అమ్మాయీ వొత్తారేమోనని."

"పిల్లేకపోయింది. అమ్మకి నోంట్లో బాగాలేదు." రంగనాథం విసుగ్గా అన్నాడు. ఆ ప్రశ్న అతను వచ్చిన తరవాత ఈ రెండురోజుల్లోనూ అందరూ తలొకసారి అడిగారు. మొదట అత్తయ్య, తరువాత మామయ్య, పుల్లి, పుల్లికూతురు, అంతానూ.

పుల్లీ, పుల్లిమొగుడూ దగ్గరగా వొచ్చారు. పుల్లి మొగుడు ఆగకుండా తిన్నగా వెళ్లిపోయాడు. పుల్లి ఆగింది. అంది:

"అబ్బాయి! తలంటోసుకుంటూగాని నడు. పొద్దోతంది."

పుల్లి అతన్ని చిన్నప్పటి నించీ అబ్బాయనే పిలిచేది. ఆ వేళ మాత్రం రంగనాథానికి ఏదో వెగటుగా అనిపించింది ఆ పిలుపు.

"ఈ వేళొద్దు. రేపు పొద్దున్న. నువ్వెళ్లు. నేను వెనకా లొస్తాను."

పుల్లీ, పిల్లంకడూ ఒకరివే పొకరు చూసుకున్న చూపు అతడు చూశాడు. ఉక్కిరి బిక్కిరి అయిపోయాడు. ఈ లోకంలో సిగ్గు అనేది ఎక్కడా లేదా అనిపించింది అతనికి.

"అమ్మాయి సూత్తుంటది నీకోసం" అంటూ పుల్లి వెళ్లి పోయింది. ఇదివర కన్నో సార్లు పుల్లి అటువంటి మాటలు సరదాగా అంటుండేది. రంగనాథానికి కడుపు నిండినట్టుండేది. కాని ఈ వేళ అంతా తలక్రిందుగా అయిపోయింది.

అతన్నీ, అతని భార్యనూ పుల్లి చిన్నప్పటి నించీ ఎత్తుకు తిప్పింది. చిన్నప్పుడే ఇద్దరిచేత తమాషామాటలన్నీ అనిపించేది. ఇద్దరికీ పెళ్లి అవుతుందని ఆమె చిన్నప్పుడే నిశ్చయించుకుంది. తన తల్లికీ, తన మేనమామకీ, అత్తకీ అందరికీ ఆమే చివరకి అంతా నచ్చచెప్పింది. పెళ్లంతా పుల్లిచేతిమీద జరిగినట్టుగా జరిగి పోయింది. పుల్లి లేకపోతే పెళ్లి చాలా వెలితిగా ఉండేది. అంతెందుకు, పుల్లి లేకపోతే రంగనాథానికి తన మేనమామల ఇంట్లో సగం సరదా లేదు. తన తల్లికీ, తన మేనమామకీ దెబ్బలాట వచ్చిన నాటినించీ పుల్లితప్ప అతనికి ఆ ఊళ్లో ఇంకో ఆత్మబంధువు ఎవరూ లేరు. తల్లికంటే ఎక్కువగా చనువయింది ఆమెతో.

అతను లేచి ఇంటివేపు బయలుదేరాడు. సన్నటి కాలవగట్టు మీద ఎదురుగా దూడల మంద వస్తోంది. అతను కాలవవాలులోకి తప్పుకుని నిలబడ్డాడు. మధ్య ఒక పెద్ద గిత్తదూడ చెవులు ఎత్తి బెదురుచూపులు అతనివేపు చూసింది. పెద్దమూపురం, దానిమీద నల్లని మచ్చ, పొట్టిగా అగుపించీ అగుపించని కొమ్ములు, చొంగ కారే నల్లటి మూతి- గిత్త వింతగా ఉంది. చటుకుని దానికి ఉద్రేకం వొచ్చి ముందు నడుస్తున్న ఆవును కుమ్మింది. మందమందంతా ముందుకి పరుగెత్తింది. వెనక నడుస్తున్న పాలికాపు మోటకర్రతో గిత్తను కొట్టాడు. మంద వెళ్లిపోయింది.

రంగనాథం పొద్దున్న జరిగిన దంతా జ్ఞాపకం తెచ్చుకున్నాడు.

పొద్దున్నే అతను బయలుదేరి పొలంవేపు వస్తున్నాడు. ఊడిగపాలెంలో ఒక పెద్దగుంపు అర్ధవృత్తంగా నిలబడీ కూర్చునీ ఉన్నారు. అతని కసలు గుంపులంటే అసహ్యం. తప్పుకుని ఇంకో దారినెంట పోదా మనుకున్నాడు. ఇంతలో పుల్లిముఖం కనబడింది. ఆమెపక్కని పిల్లంక డున్నాడు. ఊడిగపెద్ద ఒక ఎత్తు అరుగు మీద కూర్చున్నాడు. గుంపుకి ఇవతలగా మాసుకావిళ్లతో కొత్తకల్లు ఉంది. రంగనాథం కుతూహలంకొద్దీ ఆగి నిలబడ్డాడు. పుల్లి మొగుడు నిలబడి చెపుతున్నాడు:

"అదేమో, మొన్న సందలేల మాఅయ్యగారి పొలం పోయింది. ఎంచేపటికీ రాకపోతే నాకు ఇనుమానించి. పెద్దకుర్రది మంచంమీదుంది. సిన్నకుర్రదానికి నోంటరాదు. నా సుకావు తోటలో మామయ్యగారి దుగ్గనాలుంగి. అక్కడేదో వెల్తురు. సీకటపడతంది. అప్పుడు కూడా లేనండి."

అతని ముఖం మొద్దులా ఉంది. నవ్వు గొలిపే ఆవేశం ఏదో అతని ముఖంలో ఉంది. అతని మాటల్లో ఉద్రేకం ఏమీ లేదు. అతని మాటల్లో కోపం లేదు. ఏదో అనాసక్తిగా ఎంత మంచీ నిలబెట్టి బాధపెడుతున్నట్టుగా అప్పగించినట్టు చెప్తున్నాడు.

"ఏటని సూత్తా" పెద్ద అడిగాడు.

"అదిన్నీ......"

"అవెవరు?"

"మా పుల్లి. ఇదీనీ, పిల్లంకడూ సీకట్లో నిమ్మమొక్కల్లో దగ్గరగా కూకునిఉన్నారు. అదేదో దాన్ని కక్కడలో తొప్పెట్టి పొడిసినాడు. అది నవ్వింది."

"నువ్వేం సేసా?"

"ఏం సెయ్యమంటారు? రా...! ఇంటికి రా. ఓక్కలిరమడంతాను అన్నాను"

"ఇరగదన్నావా?"

"లేదండీ! యెల్లా గిరగదన్నను?"

అందరూ పకపకా నవ్వారు. పుల్లీ, పిల్లంకడూ కూడా నవ్వారు. పుల్లి మొగుడు కంగారుపడి తనూ నవ్వి కూర్చున్నాడు.

రంగనాథానికి చటుకుని పడిపోయి చెప్పకట్టనంత బాధ పెట్టింది. పుల్లి ఇల్లాంటి దని అతనికి ఇంతవరకూ తెలియదు! అతడు తొందరగా పొలం పోయాడు. కాని అతని మనస్సంతా కలిగిపోయింది.

పదిగంటలవేళ మళ్లీ ఇంటికి బయలుదేరాడు. ఆదారిని వెళ్లకూడ దనుకున్నాడు. పక్కసందులోంచి ఇంటికి మళ్లబోతుంటే అవతల పెద్ద గోల అవుతోంది. అతనికి కుతూహలం ఆగింది కాదు. సందులోంచి మళ్లి ఒక ఇంటి అరుగుపక్కనించి తొంగిచూశాడు. అందరూ ముంతలతో కల్లు తాగుతున్నారు. ఆడ, మగ ఒకళ్లమీద ఒకళ్లు పడి గెంతుతున్నారు. ఆ దృశ్యం చూసేసరికి అతనికి

అసహ్యం వేసింది. ఇంత నీచమయిన స్థితికి మనిషి దిగిపోవడం అతను ఇంతవరకూ చూడలేదు. పుల్లి కల్లు అందరికీ పోస్తూ తనూ తాగుతోంది. ఈడిగపెద్ద ఆమెవెనకాలే వచ్చి తూలుతూ ఆమె మీద పడ్డాడు. ఆమె తప్పించుకుంది. అతడు ముంతతోకూడా కింద పడిపోయాడు. ముంత చితికిపోయింది. అందరూ పక్కున నవ్వారు. పుల్లి ఇంకోముంతతో అతనికి కల్లు ఇచ్చింది. ఆమె ఒక చూపు చూసేసరికి అతని కోపం మాయమయిపోయింది. పుల్లి మొగుడు చేతిలో ముంతతో కునికిపాట్లు పడుతో గోడపక్కని కూర్చున్నాడు. పిల్లెంకడు అందరిమధ్యా తిరుగుతూ ఏవో పాటలు పాడుతున్నాడు. రంగనాథం ఇంటికి మళ్లిపోయాడు. ఇంతలో నరసన్న అతన్ని చూసి పరుగెత్తుకునివొచ్చి నమస్కరించాడు. అత డంత బాగా తాగలేదు. రంగనాథం ఏమీ ఎరగనట్టు అడిగాడు:

"ఏమిటీగొడవ ?"

"పుల్లికీ, పిల్లెంకడికీ తప్పేశారండి"

"ఎందుకు ?"

"ఎందుకేటండి బాబూ! తమకి తెలియని దేముంది? ఆడికీ దానికీ సంబంద ముందండి"

"ఎన్నాళ్లనించి ?"

"అబ్బో! శానాళ్లనించండి"

నరసన్న అతని పక్కని నడుస్తూ వస్తున్నాడు. రంగనాథానికి ఇంకేమడగాలో తోచలేదు. ఇంకా ఏదో తెలుసుకోవాలని అతనిలో ఒకపక్క కుతూహలంమాత్రం లేకపోలేదు.

"ఇంత ఇల్లాంటిదని నేనెరగను"

"అయ్యబాబు! దానికేముండి? ఏదో ఒకో లోటుంట దనుకోండి. ఎవరికి లేదు సొప్పండి? మరి పుల్లంటే పుల్లే. దానికి సాటెవ రొత్తారు?"

"అయినా ఇటువంటి పనే? మంచీ చెడ్డా ఉండొద్దూ?"

"అల్లాగంటే ఎల్లాగండి బాబూ? దాని మొగుడు సూశారా? మీ తాతయ్య కట్టిపెట్టేరు దానికి. ఆడికి బుర్రలేదు. ఎందుకూ పనికి రాడు. మరింక దిఏంజేత్తాది సొప్పండి? అతు వొట్టి రాయి. అయినా బాబూ! ఒకోనాడు ఏమీ అనలేమండి. సుక్క బాగా తగిత్తే ఇంక వొళ్లు తెలదు. అల్లాంటప్పుడింక నీదీ నాదీ అన్న మాటుండదు బాబయ్యా! ఏమయితేనేం, పుల్లి లాంటి మనిషి మళ్లీ లేదు. ఎన్నిలోకాలు నెతికినా సరే. అదలా నడిత్తే సాలు, ఒక్క సూపు సూత్తే సాలు."

"మరి ఇన్నాళ్లబట్టీ ఈసంగతి తెలియకే ఊరుకున్నారా?"

"దాని మొగుడొచ్చి పెద్ద దగ్గర అల్లరి పెట్టాడండి. పెద్ద ఇయ్యాల ఊరు పోతన్నాడు. అందుకని పొద్దున్నే కూడగట్టాం."

రంగనాథం ఇదంతా ఆలోచించుకున్నాడు. తన కివన్నీ తెలియవు గనుక పుల్లిని గురించి గొప్పగా అనుకున్నాడు ఇన్నాళ్లూనూ. ఇవన్నీ తెలిసినవాళ్లంతా పుల్లిని అంత గొప్పగా పొగుడుతా రెందుకు? వాళ్లంతా నీచులనీ, వాళ్లకి నీతీ అవినీతీ లేవనీ రంగనాథం నిశ్చయించుకున్నాడు.

ఇంటికి వచ్చినతరవాత అతని భార్య తలంటు పోసుకోమని ఎంతో బలవంతం చేసింది. అతను పోసుకోనని మొండిపట్టుపట్టాడు. అతడు దక్షిణపు పెరట్లో మల్లిపందిరిపక్కని మంచం వాల్చుకుని పడుకున్నాడు. గోడఅవతల వైష్ణవుల ఇంట్లోంచి ఏదో కమ్మని వాసన కొట్టింది. మంచంఅడుగుని అప్పుడే నీరుజల్లిన నేల మత్తుగా వాసనకొట్టింది. మల్లి పువ్వులు స్వచ్ఛంగా, చల్లగా, తెల్లగా, ఒత్తుగా పూశాయి. రంగనాథం చాలా చిరాకుగా ఉన్నాడు. పుల్లి వచ్చి మంచంపక్కని నిలబడింది. అతడు లేచి కూర్చున్నాడు.

"రా బాబూ! తలంటోసుకుందూగాని" అని మెల్లగా బలవంతపెడుతున్న గొంతుకతో అంది పుల్లి.

"నేను పోసుకోను"-రంగనాథం మళ్లీ పడుకున్నాడు. పుల్లి అతని చెయ్యి పట్టుకుని మందలిస్తున్నట్టు లేవదీసింది.

"మీ మామయ్యగారెవ పేశీపెట్టు. అంతేగాని నాదగ్గరే? లే. లే. నీళ్లు మరిగిపోతన్నాయి." ఆమె అత నింక వస్తా డన్నట్టు ధీమాగా వెళ్లిపోయింది. రంగనాథానికి లోపల చాలా చిరాకుగా ఉంది. ఆమెచనువూ, ఆమె బలవంతం, ఆమెధీమా అతనికి చాలా కోపం కలిగించాయి. అయినా అతను లేచాడు. తువ్వాలు కట్టుకుని నీళ్లసావడిలోకి వెళ్లాడు. అతని భార్య, పుల్లి అక్కడన్నీ సిద్ధంచేసి అతనికోసం ఎదురుచూస్తున్నారు. తలంటుతో పుల్లి ఎవ్వో మాట్లాడింది. అతని తల్లిని గురించి అడిగింది. చిన్ననాటి కబుర్లు ఎన్నో చెప్పింది. రంగనాథానికి ఏదో ఉడుకు గొంతుక దాకా పొంగింది. కాని, అతను ఏమీ సమాధానంచెప్పలేదు. పుల్లిస్పర్శకు అతని శరీరం మైలపడి పోయినట్టు ముడుచుకుపోయింది. తక్షణం లేచి ఎవరినో ఒకర్ని ముక్కుమీద నెత్తురువచ్చేలాగ గుద్దా లనిపించింది. కాని అతను చెయ్యి కాలూ కదపకుండా అల్లాగే తలంటించుకున్నాడు.

అతనికి ఆ వేళ భోజనం సహించలేదు. అతడు అల్లుడి తనం సాగిస్తున్నాడని మేనమామ అనుకున్నాడు. అన్నాడు కూడా అల్లాగని.

"ఏరా! మామీద కోపమొస్తేవొచ్చింది. తిండి సరిగ్గాతిను."

"కోపం ఎవరిమీద ?"

"ఏమోలే. మీ అమ్మకి ఒచ్చిందిగా నామీద."

రంగనాథం ఇంకేమీ సమాధానం చెప్పలేదు.

భోజనం అయినతరవాత మళ్లీ దక్షిణపు పెరట్లో మంచం మీద పడుకున్నాడు. చీకట్లో అతనికి ఆకాశం ఒకటే కనబడుతోంది. మల్లి పువ్వుల వాసన ఏదో పూర్వలోకాన్ని స్మరణకు తెస్తోంది. అతనికి తక్షణం ఆఊరు వదలి ఎక్కడికో పోవాలనిపించింది.

పుల్లి ఒక చేత్తో దీపమూ, రెండో చేత్తో ఇంకో పట్టెమంచమూ పట్టుకువచ్చింది. అతని మంచంపక్కని వాల్చింది. దీపం స్తంభంమీద పెట్టి రెండు పరుపులు రెండు చంకల్లోనూ మోసుకు వచ్చింది. వాల్చిన మంచంమీద పక్క వేసింది. రంగనాథం కదల్లేదు. ఆమె దగ్గరగా వచ్చి నిలబడింది.

"లే. అంగిమీద పడుకో. పక్కేస్తాను."

అతను సమాధానం చెప్పకుండా పక్క వేసిన మంచంమీదికి వెళ్లాడు. ఆమె రెండో మంచంమీద పక్క వేస్తోఉంటే అతని భార్య గుమ్మంలో వచ్చి నిలబడింది. పక్క వెయ్యగానే వచ్చి పక్కమీద కూర్చుంది.

"ఏమండీ! పుల్లిని మన ఊరు తీసుకుపోదామా?" అంది.

పుల్లి మంచంపక్కని కూర్చుంది. రంగనాథం సమాధానం చెప్పలేదు.

"మాట్లాడ్డు, రంగన్నబాబు! మే మెందుకు పనికొస్తాంలే. పట్నవాసం మరి. అమ్మాయిగనక మామీద అల్లాగుంటది?" ఆమె అమ్మాయిని నిమిరింది. అమ్మాయి పడుకుని పుల్లి చెయ్యి బుగ్గమీద పెట్టుకుంది.

"నువ్వెందుకొస్తావు? నిన్నసలు మామయ్య వొదులుతాడా? అదీగాక నీ కెన్ని ఉన్నాయి.....పిచ్చిపిల్లా!" అతను అభిమానం తో అన్నాడు. ... కోపంగా అన్నాడు.

"పాల్లెల్దగా! నేర్చుకపోవాలా. ... కాలంగాదు మరి. వచ్చే రమ్మన్నా, నే నిప్పుడు నీకూడా వచ్చేస్తాను."

"అంత నే నీరాత్రే ప్రయాణమయి వెళ్లిపోవం లేదులే."

ముత్తెంమీద రంగనాథానికి తనేదో కానిమాట అని పుల్లికి లోకువయిపోయినట్టు అనిపించింది. అతను అసలు పిల్లంకనే గొడవ ఎత్తకుండా ఉండవలసింది.

"పుల్లి, మరేం, అత్తయ్యా ఒక పెద్ద సింగారం కొండే. పొద్దున్నే దాన్నిండా నీళ్లు పోసి ఉంచుకుంటాం. సాయంత్రం దాకా సరిపోతాయి."

"అమ్మని ఓసారి తీసుకురా అబ్బాయి. లేకపోతే నన్ను తీసికెల్లినా సరే. తోడబుట్టాళ్లకి ఇల్లా మాటా మంతీ లేకపోవడం బాగుండదు. నే కలుపుతాను. నే నిల్లాగన్నానని అమ్మతో అను."

"మామయ్యా పోనీ రమ్మని రాయకూడదూ? అంత పట్టుదలెందుకు?"

"రాస్తే వొస్తుందా ఏమిటి? ఇద్దరికీ పట్టుదలే. ఇందులో తక్కువవాళ్లెవరు?" అంది అతని భార్య. సంభాషణ అకారణంగా చనువులోకి దిగిపోతోంది. అతను నిద్రవొస్తున్నట్టు నటించాడు. పుల్లి అతనివేపు చూసింది. అతను కళ్లు మూశాడు.

[అతనికి క్రమంగా నిద్రపట్టింది.....అది పల్లెటూరో పట్నవాసమో చెప్పడానికి వీలులేదు. పెద్ద చింతచెట్టుంది. దానికింద రేడియో పాడుతోంది. ఒకటేబిలుమట్టూ....]

"అంతే. నే నింక అవతలికి వెళ్లిపోవాలన్నమాట. పట్నవాసంలో కానా నేర్చుకున్నాడు బాబు. మాట్లాడితే మాట్లాడితా కన్ను మూస్తన్నాడు సూశావా అమ్మాయి? అమ్మాయి కేమీ తెలదు. పిచ్చి మాలోకం!" పుల్లి అమ్మాయిని ప్రేమగా దగ్గరగా తీసుకుంది.

"రంగన్నబాబు పెద్దోడయాడు. సిన్నప్పు డెత్తమానూ యేడుసే నాయన. ఎత్తుకోలేక సేతు లడిపోయేవి. పెద్దోడయి పెద్ద పనిలో కెళ్తే ఎంతెల్లా మారిపోతారో సూడు మొగోళ్లు...అయినా రంగన్నబాబు రంగన్నబాబే. వొజ్రగం మాణిక్యం. ఏం బాబు! ఓహ్ నిద్ర! పోతన్నాను. పెద్ద కుర్రదానికి జొరం. అమ్మాయి! పోతాను. పురుగూ పుట్రా వొస్తాయి. దీపం కిటికీలో పెడతాను. రంగన్నబాబు! మా పిల్ల మంచిదేనా? అబ్బో! నిద్ర!

పెళ్ళికి ముందు చెప్పిన్న మాటలన్నీ నాకు గురుతున్నాయితే. ఏం బాబూ! ఏదారిదాకా ఈ ఊరు రాకుండా ఎల్లాగున్నా? మా ఇల్లు మరిచిపోయావా? పోతాను......పొద్దున్నే రావాలి."

పుల్లి వెళ్లిపోయింది. రంగనాథం కళ్లు విప్పాడు.

"నిద్దరొస్తోందా?" అంది అతని భార్య.

"ఊఁ!" అని మళ్లీ కళ్లు మూశాడు.

అతని తలకింద దిండ్లు సరిజేసి ఆమెకూడా అతని పక్కని పడుకుంది.

అతనికి ఎన్నో దృశ్యాలు జ్ఞాపకం వొచ్చాయి. ఇదివరకు దాకా పుల్లి అతనికి ఆరాధ్యదేవత. ఆమెతో అతడు చెప్పని రహస్యం లేదు. చెనికయినా సరే ఆమెమీద ఆధారపడేవాడు. ఆమెతో చెప్పుకుంటే అతని మనస్సులో బరువంతా తీరిపోయినట్టుండేది. ఇక్కడికి వచ్చేముందు ఎన్నో ఆమెతో మాట్టాడా లనుకున్నాడు. తన తల్లికీ, తన మేనమామకీ మధ్య మనస్పర్థలు పెరిగిన తరవాత అతని పరిస్థితి ఇరుకులో పడింది. తన భార్యక్కీ, తన తల్లికి మధ్య ఆ తగాదా యొక్క ఛాయలు క్రొద్దికొద్దిగా వ్యాపించ ప్రారంభించాయి. వాటికన్నిటికీ పుల్లి పరిష్కారం చూపించి తీరుతుం దని అతను గంపెడాశతో ఈసారి వచ్చాడు.

తన తల్లి పక్కని కూర్చుని పుల్లి కాళ్లు చాపుకుని వెనకటి కబుర్ల నెయితో ఎల్లా అసలుసంగతి ఎత్తుతుందో, ఏమీ నొప్పి తగలకుండా ఎల్లా మనస్సు మెత్తగా చేసేస్తుందో, అంతా అతను ఇదివరకు ఊహించుకున్నాడు. ఈలోకంలో మంచి ఏదుంటే దానికంతకీ ప్రమాణం పుల్లి. పుల్లి ఒక దేవత. అతని జీవితాన్ని సవ్యంగా నడిపించడానికి ఈ లోకంలో పుట్టింది. పుస్తకాల్లో చదివే మాతృదేవతకు ఆమె అవతారంలాగ అతనికి అనిపించేది. ఆమెకు ఒక మొగుడూ, పిల్లలూ ఉన్నారన్న సంగతి అసలు రంగనాథం మరిచిపోయాడు.

పొద్దున్న సంగతి అంతా కళ్లారా చూసిన తరవాత, అతనికి పుల్లి మీద తీరని ఈసు, కోపం వచ్చాయి. తనని ఇన్నాళ్లూ ఆమె మోసగించినట్టు అతనికి అనిపించింది. ఈమె ఇల్లాంటిదని అతనికి ఇన్నాళ్లూ ఎందుకు తెలియలేదు?

అతని భార్య పక్కని మెదిలింది. ఆమెస్పర్శ అతనికి కొంచెం ఉక్కిరి బిక్కిరిగా ఉంది. ఆమె అంది:

"ఏమండీ! పుల్లిని మనం తీసికెడదామా?...దాన్ని అడిగానండి. అది మీరు సరేనంటే వస్తానంది...అత్తయ్యాకూడా ఏమీ అనదు."

"ఎందుకు అక్కడికి? రంకుమూండ?"

"చాల్లెద్దురూ. ఏం మాటలు?"

"పొద్దున్న గొడవంతా విన్నావుగా?"

"ఏదో దాని గొడవ చాలది. మరిచేటున్నా అది బాధించిందా? దానీ ఇదేమున్నా కొత్తవిషయం గనకనా. దాని మొగుడు అసలు మొద్దు అనుకొంటాం..."

"చాల్లే! ఊరుకో...నాకు నిద్రవస్తోంది."

ఆమె కొన్నేపు అల్లాగే పడుకుని లేనాతి లేచి పక్క మంచంమీదికి పోయి పడుకుంది.

అయితే అసంగతి అందరికీ తెలుసును! తనకే తెలియదు! ఏమి చేవింత? తన భార్యకూ తెలుసును. అయినా ఎంత చనువుగా, ప్రేమగా పుల్లి పక్కని కూర్చుని మాట్టాడుతోంది! ఈ పల్లెటూళ్లలో ఇంతే. నీతి లేదు. సంఘం అంతా కుళ్లి పాడయిపోతోంది. ఏమీ ప్రమాదం జరగలేదన్నట్టుగా, ఆ సంగతి అంత ముఖ్యమయినది కానట్టుగా మాట్లాడతారేం అందరూ?

అతనికి క్రమంగా ఆలోచనలు చెదిరిపోయి దారీ తెన్నూ లేకుండా తిరుగుతున్నాయి. పట్నంలో చక్కగా దుస్తులు ధరించిన స్త్రీలు, వాళ్ల మర్యాదలు, వాళ్ల తెలివితేటలు, ఎంత చనువయినా కొంచెం దూరంగా అట్టేపెట్టే సంస్కారం ఒకపక్కనీ; పల్లెటూళ్లు, గడ్డిమేట్లపక్కని వ్యభిచారాలు, అవిషయమయి సిగ్గు పడకుండా అతినిర్లక్ష్యంగా మాట్లాడ్డం, సంస్కారంలేని మోటహాస్యాలు రెండోపక్కని కలగాపులగంగా అతని మనస్సులో దొర్లిపోతున్నాయి. అతనికి క్రమంగా నిద్రపట్టింది.

* * * *

అది పల్లెటూరో పట్నవాసమో చెప్పడానికి వీలులేదు. పెద్ద చింతచెట్టుంది. దానికింద రేడియో పాడుతోంది. ఒక టేబిలుచుట్టూ పది పదిహేనుమంది కూర్చుని టీ సేవిస్తున్నారు. అందులో తక్కిన వారెవరో అతనికి గుర్తులేదు. అతని పక్కని ఒక యువతి కూర్చుంది. ఆమెముఖం ఎల్లా ఉందో అతనికి స్పష్టంగా తెలియదు. ఆమె మాత్రం ఆదర్శప్రాయ. ఆమెహృదయం అతివిశాలమయినది. ఆమెకు ఈ లోకంలో తెలియని విషయంలేదు. కాని ఆమెతో ప్రస్తావించిన విషయం ఏమిటో అతనికి గుర్తులేదు. అతని మనస్సు దూదిపింజలా ఉద్రేకంతో పైకి ఉబికింది. కొంతసేపయిన తరవాత అతడూ, ఆమే ఒక కాలవగట్టుమీదనించి నడిచిపోతున్నారు. అంతా సినీమాలలో చూసే దృశ్యంలాగ ఉంది. నీటిమీద కలవ ఆకులున్నాయి. నీటిలో కలవపువ్వు లున్నాయి. చటుకుని కాలవ చెరువులాగ అయిపోయింది. పక్కని ఒక కొత్త గడ్డిమేటి ఉంది. ఇద్దరూ ఆగడ్డిమేటి పక్కకి పోయి కూర్చున్నారు. అతడు ఆమె పక్కలో వేలెట్టి పొడిచాడు. ఆమె విరగబడి నవ్వింది. అతడామెను గట్టిగా కౌగలించుకున్నాడు. పక్కని ఎక్కడో ఆవులు కదిలిన ధ్వని.

"పుల్లీ" అన్నాడు ఇంకా గట్టిగా కౌగలించుకుంటూ.

"రంగన్న బాబుకి మతోయిందా?" అంది పుల్లి అతన్ని మెల్లగా నిమురుతూ. అతని వొళ్లంతా దూదిలా తేలికగా అయిపో

యింది. పుల్లి, చిన్నపిల్లలాగ, పెద్ద తల్లిలాగ అతన్ని ఆవరించింది. చెరువులో అతని ముఖం అకారణంగా ప్రతిఫలించింది. అందులో పిల్లెంక డున్నాడు. ఇంతలో చటుకుని పుల్లి మొగుడు అన్నాడు "రా! మక్క లిరగదంతాను."

*   *   *   *

అతనికి ముచ్చెమటలు పోశాయి. ఊపిరి ఆడ లేదు. కిటికీలో దీపం ఆరిపోయింది. అతని గుండెలు దడదడ కొట్టుకున్నాయి. అతడు తడుముకుంటూ లేచి పక్కమంచం మీదికి పోయి తన భార్యని గట్టిగా అదుముకుని పడుకున్నాడు.



అమెరికాఖండములోని అద్భుతమైన ధాన్యపు గిడ్డంగులు

పురుగులనుండి ధాన్యమును కాపాడుటకై ప్రత్యేకపుఏర్పాట్లతో ఇటువంటి ఎలివేటరుగిడ్డంగులు అమెరికాలో హెచ్చాప్రు 22000 వరకు నిర్మింపబడి యున్నవి. ఈచిత్రములోనివి ఒంటారియోరేవులోని గిడ్డంగులు.